క్లుప్తంగా

మెడికల్ కళాశాలలో దశాబ్ది ఉత్సవాలు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం దశాబ్ది ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్య రంగంలో జరిగిన మార్పులు, సాధించిన ప్రగతి గురించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర వివరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, వైద్యులు నాగేశ్వరరావు, సునీల్‌కుమార్, సుదర్శన్‌కుమార్, దినేష్, టీఎస్‌జీవోస్ ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల నాగరాజు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ జవదేకర్‌కు సన్మానం



సుభాష్‌నగర్: కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ ప్రకాష్ జవదేకర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కార్పొరేటర్లకు ప్రకాష్ జవదేకర్ పలు సూచనలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం



నిజామాబాద్‌నాగారం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం జేసీఐ ఇందూర్ ఆధ్వర్యంలో నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదానం చేశారు. రక్తదానానికి ముందుకు వచ్చిన జేసీఐ ఇందూరు ప్రతినిధులను జేసీఐ జోన్ డైరెక్టర్ జయంతిశెట్టి అభినందించారు. జేసీఐ ఇందూర్ అధ్యక్షులు జిల్కర్ నయన్, పూర్వాధ్యక్షులు జిల్కర్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సిర్నాపల్లిలో..



ఇందల్వాయి: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సిర్నాపల్లి గ్రామంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు యువజన సంఘాల సభ్యులు తెలిపారు.

బస్తీ దవాఖానా ప్రారంభం



నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ సిటీ: నగరంలో 34వ డివిజన్ మిర్చి కాంపౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను బుధవారం అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.సుదర్శనం, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బూరుగుపల్లి కల్పన, నుడ డైరెక్టర్ మల్లేశ్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు జుగల్ కిషోర్ పాండే పాల్గొన్నారు.

సంపూర్ణ సురక్ష కేంద్రం..



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రెండో అంతస్తులో సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని బుధవారం అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల ప్రారంభించారు. సంపూర్ణ సురక్ష కేంద్రంలో ఎవరైనా తమ ఆరోగ్య విషయాల గురించి అక్కడి వైద్యులను సంప్రదించి తగు సలహాలు, సూచనలు తీసుకోవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- పాత భవనాలపై కొత్తగా అంతస్తులు
- టీఎస్ బీపాస్ చట్టానికి తూట్లు
- పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు



ఆర్యనగర్‌లో పాత ఇంటిపై కొత్తగా చేపడుతున్న నిర్మాణం,



నాందేవాడలో ..

నిజామాబాద్‌నాగారం: నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలను కబ్జా చేసి నిర్మాణాలు ఒకవైపు సాగుతుంటే.. మరోవైపు ఎలాంటి సెట్‌బ్యాక్ కూడా వదలకుండా నిర్మాణాలు సాగుతున్నాయి. అలాగే పాత భవనాలపై కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారు. టీఎస్ బీపాస్ చట్టాన్ని తుంగలో తొక్కి ఇప్పటికే చాలా చోట్ల పాత భవనాలకు కనీస నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టారు. వాటిపైన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దని తెలిసినా సంబంధిత టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు నగరంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా జరుగుతున్నాయి.

నాందేవాడ ప్రాంతంలో..

నగరంలోని నాందేవాడ ప్రాంతంలో రోడ్డు చాలా చిన్నగా ఉంది. రోడ్డుకు స్థలం వదిలేసి నిర్మాణం చేపట్టాలి. అలా కాకుండా దర్జాగా నిర్మాణం చేశారు. ఇప్పటికే కట్టిన ఇళ్లు ఉండగా పైఅంతస్తు భవనానికి పర్మిషన్ ఇవ్వకూడదు. కొత్తగా నిర్మాణం చేపట్టాలంటే టిఎస్ బిపాస్ చట్టం ప్రకారం పాత భవనాన్ని కూల్చివేయాలి. ఇక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతి ఇవ్వడంతో నిర్మాణాలు సాగుతున్నాయి.

ఆర్యనగర్‌లో..

నగరంలోని ఆర్యనగర్ ప్రాంతంలో ఓ భవనం చుట్టూ ఓపెన్ స్థలం వదిలేసి నిర్మాణం చేపట్టాలి. ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారు. ఇక్కడ కూడా పర్మిషన్ అక్రమంగా ఇవ్వడంతో నిర్మాణం జరుగుతుంది. జీవో-168ను తుంగలో తొక్కారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన టీఎస్ బీపాస్ చట్టానికి మున్సిపల్ అధికారులే తూట్లు పొడుస్తున్నారు. పాత భవనంపై నిర్మాణాలు చేపట్టాలంటే కచ్చితంగా నిబంధనల ప్రకారం కట్టి ఉండాలి. లేకుంటే పైన ఒక్క అంతస్తూ అదనంగా కట్టకూడదు. ఈ విషయం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ శాఖాధికారులకు తెలుసు. అయినా కొంతమంది అధికారులు కాసులకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. పేదలు ఇళ్లు కట్టుకుంటే కొర్రీలు పెట్టే అధికారులు డబ్బులు ఇస్తే చాలు నిబంధనలు సవరించి మరీ పనులు పూర్తి చేస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

సంక్షేమ పథకాలు రద్దు కావు

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



కరపత్రాలను పంపిణీ చేసి వివరిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, నాయకులు

ఖలీల్‌వాడి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, పెన్షన్లు లాంటి పథకాలను రద్దు చేసేది లేదని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాత్రి 55వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. మాలపల్లి వద్ద ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకు సిలిండర్ అందిస్తామని, పేద ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట దోచుకుందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు , ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన వివరించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, కాంగ్రెస్ సీనియర్ నేత బాడ్సి శేఖర్ గౌడ్, అంతిరెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి



ధర్పల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీపీ సారిక

ధర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారని ఎంపీపీ సారిక హనుమంతు రెడ్డి అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో బుధవారం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సర్పంచ్ ఆర్మూర్ బాలరాజ్, ఎస్ఎంసీ చైర్మన్ నజీర్ ఉన్నారు.

జెండాగల్లి పాఠశాలలో..

నిజామాబాద్‌అర్బన్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా జెండాగల్లి పాఠశాలలో బుధవారం ఒకటవ తరగతిలో నూతనంగా ప్రవేశం పొందిన 20 మంది విద్యార్థులతో తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు.

గతంలో సర్కారు దవాఖానాకు రాను అనేవారు



ఏఎన్ఎంలకు డిజిటల్ బీపీ ఆపరేటర్ బాక్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయం లిఖించిందని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం డిచ్‌పల్లి ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో నిర్వహించిన తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకి అనే భయపడేవారని తెలంగాణ వచ్చిన తర్వాత ఇప్పుడు నేను వస్తా బిడ్డ సర్కారు దవాఖానకి అనే స్థాయికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని తెలిపారు. ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందికి అవార్డులు, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీని ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఆర్డీవో రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్ గార్డెన్ ప్రారంభం



ఎస్ఆర్ఎస్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న బాజిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లి శివారులో ఎస్ఆర్ఎస్ గార్డెన్‌ను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో కల్యాణ మండపం ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సిర్‌పూర్‌లో సిద్దులగుట్ట ఆశ్రమ ఆవరణలో ప్రతిష్ఠించిన సరస్వతీ మాత ఆలయంలో బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధిలో పాల్దా టాప్

నిజామాబాద్ సిటీ: తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నిజామాబాద్ రూరల్ మండలం పాల్దా గ్రామం అభివృద్ధిలో దేశంలోనే మూడవ స్థానంలో నిలవటం సంతోషంగా ఉందని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం పాల్దా గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే గుర్తింపు సాధించటం ద్వారా ఒక ఎమ్మెల్యేగా తనకు గుర్తింపు వచ్చిందని, దీనికి సహకరించిన గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప సర్పంచ్‌పై తిరగబడ్డ ప్రజలు..

గ్రామంలో వందశాతం అభివృద్ధి జరిగిందని ఇంకా చేయవలసిన పనులు లేవని ఉప సర్పంచ్ నరేష్ తెలుపగా ఒక్కసారి గ్రామ ప్రజలు లేచి ఆయనపై తిరగబడ్డారు. ఇంకా కొన్ని వార్డులలో పనులు మిగిలి ఉండగా పనులు ఏమి లేవని ఎలా అంటారని అగ్రహించటంతో సమావేశం రసభసగా మారింది. గ్రామ సర్పంచ్ అమనీ నవీన్, ఎంపీపీ బానోత్ అనూషా, జడ్పీటీసీ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ధర్పల్లి: రేకులపల్లి గ్రామానికి చెందిన గజ్జల లక్ష్మణ్, పోతున్నూర్ తండాకు చెందిన ధరావత్ రమేష్ మంగళవారం రాత్రి రేకులపల్లి గ్రామంలో బోరు మోటర్ వద్ద మరమ్మతులు చేసేటప్పుడు విద్యుత్ షాక్ గురై మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. ఇరువురి కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, రెండు కుటుంబాల సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఘటనకు కారణమైన లైన్మెన్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ సారిక, సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

ఎంపీ అర్వింద్‌పై బాజిరెడ్డి ఫైర్

మాధవనగర్ ఆర్వోబీ పనుల ప్రగతిలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ చేస్తున్న అసత్య ప్రచారాలపై ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఫైర్ అయ్యారు. ఇత్తేసి పొత్తు గూడిన చందంగా అర్వింద్.. ఈ ఆర్వోబీ పనులను తామే చేస్తున్నామని, కేంద్రమే అంతా ఖర్చుపెడుతుందనే అబద్ధపు ప్రచారాలను చేస్తూ అవే తప్పుడు కూతలు కూస్తున్నాడని, దగుల్బాజీ మాటలు చెప్పుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 63కోట్లు కేటాయించి భూసేకరణ, ఇరువైపులా అప్రోచ్ రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తూ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ఆర్అండ్‌బీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పనులు సత్వరం జరిగేలా చూసుకుంటున్నారని తెలిపారు. కష్టం ఒకరిది..తప్పుడు ప్రచారాలతో లాభపడాలనే వాట్సాప్ యూనివర్సిటీ దొంగ తెలివి అర్వింద్‌ది అని ఆయన ఘాటు విమర్శలు చేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి గెలిచావని, బాండు పేపర్ రాసి మరీ రైతులను మోసం చేసిన నువ్వో చరిత్ర హీనుడవు, తప్పుడు హామీలతో గద్దెనెక్కిన దగుల్బాజీ ఎంపీవని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నీ రాజకీయ జీవితమే ఫేక్ అని, నీ సర్టిఫికెట్లు ఫేకేనని, అబద్ధాల మేడల మీద రాజకీయం చేస్తూ కాలం గడుపుతున్న నీ దగుల్బాజీ రాజకీయం పేక మేడలా కుప్ప కూలిపోకతప్పదని హెచ్చరించారు.

సంక్షిప్తం

మొదటి రోజు ప్రశాంతంగా పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 372 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 79 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ 14వ వార్షికోత్సవం

నిజామాబాద్ సిటీ: నగరంలోని గౌతంనగర్ రేణుక ఎల్లమ్మ 14వ వార్షికోత్సవము కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆలయానికి అమ్మవారి ఘటం తీసుకువచ్చి వేద మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి, పట్నాలు వేశారు. స్థానిక కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ శివచరణ్ ఉన్నారు.

ఇంపాక్ట్ ఆధ్వర్యంలో శిక్షణ

సిరికొండ: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యచరణ తదితర అంశాలపై నిర్వహించిన శిక్షణలో సిరికొండకు చెందిన ముక్కంటి పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు గంప నాగేశ్వర్‌రావు 35 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు ముక్కంటి తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న విషయాలపై ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఆదినారాయణరెడ్డి, ముక్కంటికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఆదిలాబాద్ ఆర్ఎం

ఖలీల్‌వాడి: రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను తన నివాసంలో బుధవారం ఆదిలాబాద్ ఆర్ఎం జానీ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్టీసీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. డిపో మేనేజర్-1 ఆనంద్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

డిచ్‌పల్లి: దేవనగర్ క్యాంప్ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి అభిషేక్ మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. అభిషేక్ అంత్యక్రియలు బుధవారం జరిగగా.. అభిషేక్ మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి డాక్టర్ భూపతిరెడ్డి నివాళులర్పించారు.

విజయేంద్ర స్వామి ప్రవచనాలు



నిజామాబాద్ సిటీ: నగరంలో శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఇందూరు విజయ యాత్ర కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా విజయేంద్ర సరస్వతి స్వామి బుధవారం నగరంలోని సార్వజనిక్ గణేశ్ ఆలయాన్ని సందర్శించారు. భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు.

పద్మశాలి సంఘానికి హాల్ వితరణ



నిజామాబాద్ నాగారం: నగరంలోని కోటగల్లీ పద్మశాలి సంఘం-8 తర్ఫ వ్యవస్థాపకులు తుమ్మ మీనయ్య-రాజవ్వ జ్ఞాపకార్థం వారి మనుమళ్లు తుమ్మ సంజీవ్, శ్రీనులు ఒక హాల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు యాదగిరి, పట్టణ అధ్యక్షులు గుజ్జేటి నర్సయ్య, జిల్లా సెక్రటరీ పుల్గం హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



సిరికొండ: వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి సుస్థిరప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బీజేపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కులాచారి దినేష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. దినేష్ సమక్షంలో గడ్కోల్‌కు చెందిన బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు గంగనర్సయ్య, బీజేపీలో చేరారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

ఖలీల్‌వాడి: మిషన్ భగీరథ కార్మికులకు జీవో నెంబర్- 60 ప్రకారం వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్యలు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎస్ఈకి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు బాలరాజు, పోశెట్టి, తారాచంద్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'బడా ఖానా'

ఖలీల్‌వాడి : నగరంలోని శ్రీ రామా గార్డెన్స్‌లో బుధవారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బడా ఖానా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ పదేళ్లలో పోలీస్ శాఖలో ఎన్నో మార్పులు వచ్చాయని, గతంలో శాఖలో వాహనాలు తక్కువగా ఉండేవాని, ప్రస్తుతం చాలా వాహనాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ చేస్తున్నాయన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన 35 మందిని సన్మానించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నూడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ధర్పల్లి/సిరికొండ: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ధర్పల్లి, సిరికొండ మండలాల విద్యా వనరుల కేంద్రంలో వినతి పత్రాలు సమర్పించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే వచ్చే నెల 1 నుంచి సమ్మెకు దిగుతామని వారు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో రూ.8 కోట్ల పాత బకాయిలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న మధ్య భోజన కార్మికులకు మళ్లీ కొత్త మెనూ ప్రకారం వంటలు చేయాలని అధికారులు కార్మికులను వేధిస్తున్నారని చెప్పారు.

జేఎల్ఎంపై విచారణ ప్రారంభం

నిజామాబాద్ నాగారం : విద్యుత్ శాఖలో జేఎల్ఎం రవిపై విచారణ ప్రారంభమైంది. కన్‌స్ట్రక్షన్ డీఈ వెంటకరమణ బుధవారం విచారణ ప్రారంభించారు. సాక్షిలో ఏప్రిల్ 13న వచ్చిన 'స్తంభం మార్చినందుకు డబ్బులు డిమాండ్ కథనానికి స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కన్‌స్ట్రక్షన్ డీఈ చాంబర్‌లో విచారణ చేశారు. రెండు మూడు రోజుల్లో విచారణ నివేదికను ఉన్నతాధికారులక సమర్పించనున్నారు.

45 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరిక

నిజామాబాద్‌అర్బన్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా బుధవారం నాగారం 300 క్వార్టర్స్‌లోని జీపీఎస్ జెండాగల్లీ పాఠశాల నుంచి ఐదవ తరగతిలో ఉత్తీర్ణులైన దాదాపు 45 మంది విద్యార్థులను పక్కనే ఉన్న ఖలీల్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో ఆరవ తరగతిలో చేరారు.ప్రధానోపాధ్యాయులు రామ్ చందర్ పాల్గొన్నారు.

అభినందనలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్‌లో ఎస్బీ ఏసీపీగా పని చేస్తున్న మధుసూదన్‌రావుకు డీసీపీగా పదోన్నతి లభించింది. బుధవారం ఇన్‌ఛార్జి సీపీ ప్రవీణ్ కుమార్, మధుసూదన్‌రావును అభినందించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,100	వెండి (కిలో)	75,500
22 క్యారెట్స్	56,332	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	30	50	క్యాప్సికం	50	70
బెండకాయ	20	40	గాజరుగడ్డ	30	50
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	60	80
దొండకాయ	25	50	దోసకాయ	10	20
చిక్కుడుకాయ	150	200	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిగడ్డ	15	40
వంకాయ	20	40	గోబిపువ్వు	30	50
పాలకూర	30	50	బీట్‌రూట్	30	50
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	50	70	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	240
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 విమానం -1.30,7.30
పరేషాన్ -4.30
ఇంటింటి రామాయణం -10.30

స్క్రీన్-2 టక్కర్ -10.50
మేమ్ ఫేమస్ - 01.35
ట్రాన్స్‌ఫార్మర్స్ - 4.30,7.20, 10.20

స్క్రీన్-3 ది ఫ్లాష్-(ఇంగ్లీష్) - 11.00,1.50
4.40,7.30,10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 ది ఫ్లాష్ (తెలుగు) 10.00, 1.10
ది ఫ్లాష్(ఇంగ్లీష్) 4.20,7.30,10.40

స్క్రీన్-2 ట్రాన్స్‌ఫార్మర్స్-3డీ(ఇంగ్లీష్) -12.15
6.05,9.00
3డీ-ట్రాన్స్‌ఫార్మర్స్(ఇంగ్లీష్) - 3.10

స్క్రీన్-3 జర హట్‌కే జర బచ్‌కే(హిందీ) -12.35
స్పైడర్‌మాన్- (ఇంగ్లీష్) -3.30
విమానం -6.35
మేమ్ ఫేమస్ - 9.20

స్క్రీన్-4 టక్కర్ -1.10
పరేషాన్ -4.10
ఇంటింటి రామాయణం -7.05
జర హట్‌కే జర బచ్‌కే(హిందీ) -10.00

దేవి	ది ఫ్లాష్(ఇంగ్లీష్)
నటరాజ్	ట్రాన్స్‌ఫార్మర్స్
లలితామహల్	టక్కర్
విజయ్	అన్‌స్టాపబుల్